
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు
సోమవారం 19 మే 2025



టెన్త్ సప్లిమెంటరీకి సన్నద్ధం
విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ
జూన్ 3 నుంచి పరీక్షలు
7
ఆస్పత్రి భవనంపైకి ఎక్కి
యువకుడి హల్‌చల్

తడిసిన ధాన్యాన్నీ కొంటాం

- పది రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి
- త్వరలోనే సన్నాలకు బోనస్
- మెదక్ జిల్లా పౌరసరఫరాలశాఖ డీఎం జగదీష్



డీఎం జగదీష్

ఫటా ఫట్

మెదక్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తున్నామని మెదక్ జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్ జగదీష్ వెల్లడించారు. జిల్లాలో ధాన్యం సేకరణపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

అకాల వర్షాలకు తడిసిన వడ్లు ఎలా విక్రయించాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. వారిని ఆదుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ధాన్యం తడవకుండా సరిపడా టార్పాలిన్లు కావాలని సీజన్ ప్రారంభంలోనే మార్కెటింగ్ అధికారులకు ఇండెంట్ పెట్టాం. కానీ, సరపడా టార్పాలిన్లు కేంద్రాలకు చేరలేదు. ప్రస్తుతం కలెక్టర్ ఆదేశాలమేరకు తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 2,400 క్వింటాళ్ల తడిసిన ధాన్యాన్ని సేకరించి పారాబాయిల్డ్ మిల్లులకు తరలించాం.

సేకరించిన ధాన్యాన్ని తరలించడానికి సరిపడా వాహనాలు ఉన్నాయా? జిల్లాలో పలుచోట్ల రైతుల నుంచి వస్తున్న ఫిర్యాదులపై ఎలా స్పందిస్తున్నారు?

జిల్లావ్యాప్తంగా రైతుల నుంచి సేకరిస్తున్న ధాన్యం తరలించడానికి 570 వాహనాలు అందుబాటులో ఉంచాం. అయినా కేంద్రాలకు ధాన్యం భారీగా తరలివస్తుండడంతో మరో మంద లారీలు సమకూర్చాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. ఒకటి రెండు రోజుల్లో మరిన్ని వాహనాలు అందుబాటులోకి వస్తాయి.

సన్న వడ్లకు రూ.500 బోనస్ ఎప్పుడు చెల్లిస్తారు?

ప్రభుత్వం ప్రకటించిన విధంగా సన్నరకం వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ త్వరలోనే రైతులకు బోనస్ నగదు వారి ఖాతాల్లో జమవుతాయి.

ట్రక్‌షీట్లు లేకండానే ధాన్యం మిల్లులకు తరలిపోతోందనే ఫిర్యాదులు వస్తున్నాయి?

ఇటీవల పాపన్నపేట మండల కేంద్రంలోని ఓ మిల్లుకు ట్రక్‌షీట్లు లేకుండానే ఒక లోడ్ ధాన్యం వచ్చిందని మాకూ సమాచారం రావడంతో క్షేత్రస్థాయిలో విచారణ జరిపించాం. రైతులు కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యం సేకరణలో ఆలస్యం జరుగుతుండడంతో ఆయన ప్రోద్బలంతోనే రైస్‌మిల్లుకు ధాన్యం తరలించబడిందని తేలింది. ఆ తర్వాత ధాన్యం తగ్గిందని మిల్లర్‌తో రైతు విభేదించడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చిందని తేలింది. ట్రక్ షీట్ లేకండా కొనుగోలు కేంద్రం నుంచి బయటకు తరలిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం.

నిఘా నేత్రం



సంగారెడ్డి జీజీహెచ్‌లో మరో 30 సీసీ కెమెరాలు

సంగారెడ్డి జీజీహెచ్‌లో రెండ్రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు ఆడ శిశువును వదిలి వెళ్లారు. గతేడాది అక్టోబరు 9న శిశువు కిడ్నాప్ కాగా.. మరుసటి రోజు హైదరాబాద్‌లోని బోరబండలో కనుగొన్నారు. గతంలోనూ ఎంసీహెచ్ ఎస్ఎన్‌సీయూ నుంచి నవజాత శిశువును ఎత్తుకెళ్లారు. మూడు రోజుల గాలింపు అనంతరం పసికందును కామారెడ్డిలో గుర్తించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఇలా వరుస ఘటన నేపథ్యంలో జీజీహెచ్‌లో నిఘా కట్టుదిట్టం చేసే చర్యలు తీసుకుంటున్నారు. ఆస్పత్రిలో ఇప్పటికే 26 సీసీ కెమెరాలు ఉండగా.. తాజాగా మరో 30 సీసీ కెమెరాల ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.



- ఒకటి రెండు రోజుల్లో బిగించేందుకు చర్యలు
- ప్రతీ ఒక్కరి కదలికలు నిక్షిప్తమయ్యేలా ఏర్పాటు
- ఇప్పటికే 26 కెమెరాలతో నిఘా
- అదనపు కెమెరాల బిగింపుతో మరింత పటిష్టం
- పరిశీలన, పర్యవేక్షణ కట్టుదిట్టం

సంగారెడ్డి అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇక పూర్తిగా నిఘా నీడలోకి రానుంది. మూడేళ్ల కిందట ఎన్ఎంసీ ఆదేశాల మేరకు 26 సీసీ కెమెరాల ఏర్పాటు చేశారు. తాజాగా మరో 30 సీసీ కెమెరాల ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తికాగా ఒకటి రెండు రోజుల్లో కెమెరాల బిగింపు ప్రారంభించనున్నారు. ఈ పనులు పూర్తయితే ఆస్పత్రి, ప్రాంగణం పూర్తిగా నిఘా నీడలోకి వెళ్లనుంది.



పసికందు కిడ్నాప్ దృశ్యాలను సీసీ కెమెరాలో పరిశీలిస్తున్న పోలీసులు, ఆస్పత్రి అధికారులు(ఫైల్)

450 పడకలు.. వేలల్లో ఓపీ

సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 450 పడకల సామర్థ్యంతో వార్డులు ఉన్నాయి. ఇదే ప్రాంగణంలో 150 పడకల మాతాశిశు ఆరోగ్య కేంద్రం కూడా ఉంది. నిత్యం ఔట్‌పేషెంట్ విభాగంలో 1,500 మంది, ఇన్‌పేషెంట్‌గా 450 మంది వైద్య సేవలు పొందుతుంటారు. డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది కలిపి సుమారు 600 మంది వరకు పనిచేస్తున్నారు. జిల్లా నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా చికిత్స కోసం ఇక్కడికి వస్తుంటారు. నిత్యం జన సంచారం ఉండే ఈ ఆస్పత్రిలో భద్రత దృష్ట్యా సీసీ కెమెరాల ఏర్పాటు అత్యంత ఆవశ్యకం.

కేసుల విచారణలో కీలకం

జీజీహెచ్ ఆవరణలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో రెండ్రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు ఆడ శిశువును వదిలి వెళ్లారు. నవజాత శిశువుల కిడ్నాప్‌లు కలకలం రేపాయి. ఐదేళ్ల కిందట ఇదే ఎంసీహెచ్‌లోని ఎస్ఎన్‌సీయూ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు నవజాత శిశువును ఎత్తుకెళ్లారు. మూడు రోజుల పాటు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి ఎట్టకేలకు పసికందును కామారెడ్డిలో పోలీసులు పట్టుకొని కుటుంబసభ్యులకు అప్పగించారు. ఇక గతేడాది అక్టోబరు 9 వ తేదీన ఒక్కరోజు పసిపాప కిడ్నాప్ చేయగా మరుసటి రోజు హైదరాబాద్‌లోని బోరబండలో పట్టుకున్నారు. జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో పట్టపగలు చోటు చేసుకున్న ఈ ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఈ ఘటనల్లో దర్యాప్తులో సీసీ కెమెరాలు కీలకంగా మారాయి. ఇవే కాకుండా ఈ ఆస్పత్రిలో సెల్‌ఫోన్, బైక్ చోరీలు నిత్యకృత్యమైన నేపథ్యంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో వీటన్నింటికి చెక్ పడే అవకాశం ఉన్నది.

నిరంతరం పర్యవేక్షణ



ఆస్పత్రిలో అన్ని విభాగాలు నిఘా నీడలోకి వచ్చేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇకపై లోపలికి వచ్చిన నుంచి వెలుపలికి వెళ్లే వరకు ప్రతి ఒక్కరి కదలికలపై నిఘా ఉంటుంది. డాక్టర్లు, సిబ్బంది హాజరు, విధులపైనా పర్యవేక్షణ ఉంటుంది. రోగులతో పాటు సందర్శకులు, డాక్టర్లు, ఉద్యోగుల భద్రత దృష్టిలో ఉంచుకుని పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాం.

\- అనిల్‌కుమార్, సూపరింటెండెంట్, జీజీహెచ్

ఉండేనా.. కూలేనా?

- శిథిలావస్థలో పలు గ్రామాల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు
- పిల్లర్లకు పగుళ్లు..
- పెచ్చులూడి, ఇనుప చువ్వలు తేలిన నిర్మాణాలు
- మరమ్మతులు చేయాలని గ్రామస్థుల వినతి

7



పదిరోజులని.. నెలలపాటు మూసివేత

- మరమ్మతుల పేరుతో రైల్వేగేట్ క్లోజ్
- ఇబ్బందులు పడుతున్న ఈదులనాగులపల్లి గ్రామస్థులు
- శాశ్వతంగా మూసివేసే యోచన!
- పెరగనున్న దూరాభారం

7

ఎర్రటిపూలతో ఆహ్లాదం

మండుటెండల్లోనూ బొంతపల్లి-జిన్నారం రహదారిపై ప్రయాణం ఎర్రటిపూలతో ఆహ్లాదాన్ని పంచుతున్నది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు చిగురించి నిండుగా పూలతో కనువిందు చేస్తున్నాయి. ప్రకృతి సౌందర్యానికి ఈ దృశ్యం నిదర్శనంగా నిలుస్తున్నది. ఈ రహదారిపై ప్రయాణం చేసే వాహనదారులు చెట్ల కింద వాహనాలను నిలిపి సేదతీరుతున్నారు.

-గుమ్మడిదల, మే 18 (ఆంధ్రజ్యోతి)



దుమ్ముకొట్టుకుపోయి అధ్వానం

ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడలో రెడీమిక్స్ యూనిట్‌లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. నిర్మాణసంస్థలకు కావాల్సిన రెడీమిక్స్‌ను తరలించే వాహనాల రాకపోకలతో రోడ్లు ధ్వంసమై దుమ్మురేగుతున్నాయి. ఈ రోడ్లపై వెళ్లాలంటేనే చిన్న వాహనాలు నడిపేవారు భయపడుతున్నారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు నిత్యం దుమ్మూధూళితో అనారోగ్యాల బారినపడుతున్నారు.

-ఐడీఏబొల్లారం ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి)





సంగారెడ్డిలో కలెక్టర్ క్యాంపు కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

క్యాంపు కార్యాలయ భవన నిర్మాణంలో నాణ్యత పాటించండి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ క్యాంపు కార్యాలయ భవన నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. సంగారెడ్డిలోని పాత కలెక్టరేట్ కార్యాలయ ప్రదేశంలో నిర్మిస్తున్న కలెక్టర్ క్యాంపు కార్యాలయ భవన నిర్మాణ పనులను కలెక్టర్ ఆదివారం ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ క్యాంపు కార్యాలయాన్ని రూ. 250 కోట్ల నిధులతో నిర్మించనున్నట్టు తెలిపారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, ప్రస్తుత అవసరాలకనుగుణంగా నిర్మించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆర్‌అండ్‌బీ డీఈ రామకృష్ణ, ఇంజనీరింగ్ శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

సీలింగ్ భూములు మాయం

కబ్జా పర్వం - 5

- జిన్నారం మండలంలో పదుల ఎకరాలు అన్యాక్రాంతం
- రికార్డులకు.. క్షేత్రస్థాయిలో భూములకు కుదరని పొంతన
- గడ్డపోతారం, వావిలాల, బొల్లారంలో భారీగా ఆక్రమణలు



వావిలాల గ్రామంలో 190 సర్వే నంబర్‌లోని సీలింగ్ భూమి

జిన్నారం, మే, 18, (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలంలో విలువైన సీలింగ్ భూములు కనుమరుగవుతున్నాయి. రెవెన్యూ రికార్డుల్లో ఉండే వివరాలకు.. క్షేత్రస్థాయిలో భూమికి పొంతన ఉండటం లేదు. మూడు పారిశ్రామికవాడలున్న గ్రామాల్లో నాలుగు దశాబ్దాలుగా సీలింగ్ భూముల ఆక్రమణ భారీగా జరిగిందనే ఆరోపణలున్నాయి.

రూ. కోట్ల భూములకు రక్షణ కరువు

జిన్నారం మండలంలోని పలు గ్రామాల్లో వందల ఎకరాల సీలింగ్ భూములు ఉన్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన గడ్డపోతారం, కాజీపల్లి, వావిలాల, బొల్లారం ప్రాంతంలోని సీలింగ్ భూముల సంరక్షణలో ఏళ్ల తరబడి అధికారులు ఎలాంటి ప్రత్యేక చర్యలు చేపట్టలేదు. ఆయా గ్రామాల్లో ఎకరం భూమి రూ. 2 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు ధర పలుకుతున్నది. మండలంలోని వావిలాలలో 190 సర్వే నంబర్‌లో ప్రభుత్వం సీలింగ్ యాక్ట్ కింద 60 ఎకరాలను సేకరించింది. ఇటీవల ఈ భూముల్లో కొత్త పారిశ్రామికవాడను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సర్వే నిర్వహించగా కేవలం 34 ఎకరాలే ఉన్నట్లు తేలింది. మరో 26 ఎకరాల భూమి ఎక్కడనేది ప్రశ్నార్థకంగా మారింది. మరో పారిశ్రామికవాడ గడ్డపోతారంలోనూ విలువైన సీలింగ్ భూముల జాడా కనిపించటం లేదు. 79 సర్వే నంబర్‌లోనూ 135 ఎకరాల సీలింగ్ భూములు ఉండగా వీటిని గతంలో ప్రభుత్వం 'దిల్' సంస్థకు కేటాయించింది. ఆ సంస్థ ఆదీనంలో ఉన్న సమయంలోనే ఈ భూముల్లో పదుల ఎకరాలను ప్రైవేటు వ్యక్తులు, పరిశ్రమలు కబ్జాలు చేశాయనే పిర్యాదులున్నాయి. దీంతో ప్రభుత్వం ఆ సంస్థను రద్దు చేసి తిరిగి భూములను స్వాదీనం చేసుకుంది. ఈ భూములలో గత ముప్పై ఏళ్లలో రూ.100 కోట్లకు పైగా విలువైన స్థలాలు అన్యాక్రాంతం అయినట్లు ఆరోపణలున్నాయి. సర్వే నంబర్ 10లో 62.8 ఎకరాల సీలింగ్ భూమి ఉండగా ప్రస్తుతం 10 ఎకరాలు కూడా కనిపించటం లేదు. ఇక్కడ చాలా వరకు పరిశ్రమలు తమ సమీపంలోని భూములను కబ్జాలు చేయగా, మిగిలిన కొంత స్థలాన్ని పలు పరిశ్రమలకు కేటాయించారు. ఇటీవల ఇక్కడే పలు అక్రమ కట్టడాలు కట్టగా నామమాత్రంగా కూల్చివేసిన రెవెన్యూ అధికారులు మిగిలిన స్థలం సంరక్షణ మరిచారు. ఈ ప్రాంతంలో ఎకరం రూ. 5 కోట్ల వరకు పలుకుతున్నది. బొల్లారం పారిశ్రామికవాడ, అమీన్‌పూర్ మండల సరిహద్దుల్లో ఉండే 172 సర్వే నంబర్‌లో 53.18 ఎకరాల సీలింగ్ భూమి ఎక్కడుందో కూడా తెలియని పరిస్థితి ఉన్నది. రెండు మండలాల సరిహద్దు ప్రాంతం కావటంతో సర్వే నంబర్ల రికార్డుల్లో గందరగోళం సృష్టించి పలువురు అక్రమార్కులు భూములను చెరబడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇక్కడ ఎకరం రూ. 15 కోట్ల పైమాటే. ఈ లెక్కన రూ. వందల కోట్ల విలువైన భూముల హద్దులు ఎక్కడో తెలియని దుస్థితి నెలకొంది. ఇంత విలువైన భూములు ఆక్రమణల బారినపడుతున్నా రక్షణ కోసం ఫెన్సింగ్, కందకాలు ఏర్పాటు చేయడంలేదు. ఈ విషయంపై తహసీల్దార్ భిక్షపతి స్పందిస్తూ వావిలాలలో సీలింగ్, ఫారెస్ట్ భూములను సర్వే చేయాల్సి ఉందని, బొల్లారంలో రెండు మండలాల సరిహద్దులల్లోని సర్వేనంబర్లలో సర్వే చేపడతామని పేర్కొన్నారు.

మార్డి పెద్దచెరువు కబ్జా

ఎఫ్‌టీఎల్‌లో కట్టలు వేసి యథేచ్ఛగా ఆక్రమణ

7

సీఎం పర్యటనపై ఎంపీ సమీక్ష

జహీరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలో ఈ నెల 23న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉండే అవకాశం ఉందని ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ పేర్కొన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం ఆయన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటన ఖరారు అయితే చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. హుగ్గెల్లి చౌరస్త వద్ద ఏర్పాటు చేసిన బసవేశ్వరుడివిగ్రహాన్ని సీఎంసైతం ప్రారంభించనున్న నేపథ్యంలో లింగాయత్‌సమాజ్ నాయకులతో ఎంపీ సమావేశం నిర్వహించి ఏర్పాట్లు చేసుకోవాలని సూచనలు చేశారు. సీఎం పర్యటన షెడ్యూల్ అధికారికంగా వెలువడిన అనంతరం ఏర్పాట్లు చేపట్టాలని అధికారులు, నాయకులు పేర్కొన్నారు.


రైతులకు ఇబ్బందులు కలగొద్దు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేట్‌లో ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట్ గేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తెచ్చిన ప్రతీ గింజను కొనుగోలు చేయాలని అధికారులరు ఆదేశించారు. ఐకెపీ ఏపీఎం సంగమేశ్వర్ పాల్గొన్నారు.







ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

● పలు గ్రామాల్లో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనలు..

● ఘనంగా బోనాల సమర్పణ

ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.. ఆదివారం అందులోనూ వేసవి సెలవులు కావడంతో పిల్లాపాపలతో ఆలయాలకు తరలివచ్చారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

వర్గల్/జగదేవ్‌పూర్/చేర్యాల/పాపన్నపేట/హుస్నాబాద్/సిద్దిపేటకల్చరల్/గుమ్మడిదల/పెద్దశంకరంపేట/చిన్నశంకరంపేట, మే18: వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని తీగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలోని కొండపోచమ్మ దేవాలయంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది.

● కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సందర్శనార్థం ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయపరిసరాలు భక్తజనసందోహంగా మారాయి. ఈసందర్భంగా తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నాన మాచరించారు. భక్తిప్రపత్తులతో బోనం నివేదించి చెలక, నజరు, ముఖమండప పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి దర్శనంకోసం సుమారు 2గంటల సమయం పట్టింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో అన్నపూర్ణ, ఆలయ ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు తదితరులు పర్యవేక్షించారు.

● కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నం నుంచి కొండపోచమ్మ దేవాలయానికి విచ్చేశారు. రంగులతో అలంకరించిన బోనాలను నెత్తిపై ఎత్తుకొని శివసత్తుల శిగాలు డప్పు చప్పుల్లతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని ఆలయ ఈవో మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కనకయ్య, హరిబాబు తదితరులు ఉన్నారు.

● ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం దర్శనం కల్పించారు. మంజీరా నదీపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మాతను దర్శించుకున్నారు. బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాలికను కాపాడిన పోలీసులు

వనదుర్గామాత ఆలయ సమీపంలోని చెక్‌డ్యాంలో ప్రమాదవశాత్తూ నీటిలో జారిపడిన ఓ బాలికను క్యూఆర్టీ పోలీసులు రక్షించినట్లు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ సమీపంలో కామారెడ్డి జిల్లా చింతపల్లికి చెందిన మరో బాలుడు లలిత్ గౌడ్ ఆలయ పరిసరాల్లో తప్పిపోయి తిరుగుతుండగా గమనించిన క్యూఆర్టీ పోలీసులు బాలుడి వివరాలు తెలుసుకొని ఆలయం వద్ద వారి తల్లిదండ్రులకు అప్పగించారు .ఈ సందర్భంగా ఏఆర్ఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు యాదగిరి, రాజేందర్‌ను ఆయన అభినందించారు.

● హుస్నాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవి జాతరకు భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకునేదుకు గంటల పాటు క్యూలో నిల్చున్నారు. ఒడిబియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రేణుకా ఎల్లమ్మ జాతర మరో 24 రోజులు ఉండటంతో దినదినం భక్తుల రద్దీ పెరుగుతుంది. ఆదివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో మల్యాల కృష్ణ ఒగ్గు డోలు బృందం ప్రదర్శన నిర్వహించారు. ఈ బృంద ప్రదర్శన జాతరకు వచ్చిన భక్తులను అలరించింది. ఇందులో ఉత్సవ కమిటీ సభ్యులు పచ్చిమట్ల రాధ, పూదరి శ్రీనివాస్‌గౌడ్, పచ్చిమట్ల శ్రీకాంత్, రమాదేవి, గాజుల భగవాన్, వీర రాజు, బెక్కంటి రాజయ్య, పరమేశ్వర్ తదితరులున్నారు.

● సిద్దిపేట జిల్లా కేంద్రంలోని నీలకంఠనగర్‌లోని శ్రీగౌరి సహిత నీలకంఠేశ్వర స్వామి ఆలయ 34వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం స్వామి వారికి రథోత్సవం నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేకంగా చేయించిన రథంలో పట్టణ పుర వీధుల గూండా స్వామి వారిని ఊరేగించారు. సిద్దిపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం వైనతేయ ఇష్టి, హోమాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం జరిగింది. స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని త్రిదండి దేవనాథ్ చినజీయర్ స్వామి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు.

● గుమ్మడిదల మండల పరిధిలోని కొత్తపల్లిలో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవ కార్యక్రమాలు కొనసాగాయి. పురోహితులు ఆంజనేయ శర్మ మంత్రోచ్చరణ నడుమ మధ్య గుడి దాతలు బొంతపల్లి మాజీ సర్పంచ్ ఆలేటి నవీన శ్రీనివాస్‌రెడ్డి, ఆలేటి జగన్మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, లలితా నరసింహారెడ్డి, ఆంజనేయులు, రాజశేఖర్, వేణు, దేవేందర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, మంగయ్య, సదానందరెడ్డి, గోపాల్, సత్తయ్య, చక్రపాణి, నగేష్‌గౌడ్, వినోద్‌గౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

● పెద్దశంకరంపేట మండల పరిధిలోని కొప్పోల్ ఉమా సంగమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. 108 జంటలు వ్రతాల్లో పాల్గొన్నాయి. భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు పద్మబాపిరాజు, కొత్తపల్లి రాజులు, సీతారామారావు, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని మక్తలక్ష్మాపూర్‌లో మాణిక్ ప్రభు మహారాజ్ జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి అంగరంగ వైభవంగా బోనాలను సమర్పించారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, యువకులు గ్రామస్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

● చిన్నశంకరంపేట మండలం అంబాజీపేటలో గౌడ సంఘం ఆధ్వర్యంలోని రేణుకా ఎల్లమ్మ ప్రతిష్ఠాపనలు రెండోరోజు కొనసాగాయి. ఆదివారం పండితులు యంత్ర పూజలు నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. పూర్ణాహుతి, పట్నం పూజ, బండారు కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. చిన్నశంకరంపేట మండలం సూరారంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దిరాజు పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆఖరిరోజు అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

● చేర్యాల మండలం దానంపల్లి గ్రామంలో బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా మహంకాళి, పోచమ్మ దేవతకు భక్తిప్రపత్తులతో బోనాలు నివేదించారు. డప్పుచప్పుళ్ల దరువు, శివసత్తుల సిగాల నడుమ మహిళలు ఊరేగింపుగా ఆయా ఆలయాలకు చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమ పాడి పంటలు చల్లగా ఉండాలని వేడుకున్నారు. బోనాల పండుగ నేపథ్యంలో గ్రామంలో సందడి నెలకొన్నది.

అమర్‌నాథ్‌లో భక్తులకు సిద్దిపేట అన్నప్రసాదం

సిద్దిపేట ఆధ్యాత్మిక, ధార్మిక, సామాజిక సేవలకు నెలవుగా మారిందని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఇటీవలే కేదార్‌నాథ్‌లో అన్నదానం కార్యక్రమం నిర్వహించి జూలై 3 నుంచి అమర్‌నాథ్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో అమర్‌నాథ్ సేవా సమితి వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అన్నప్రసాద కార్యక్రమ కరపత్రాన్ని హరీశ్‌రావు ఆవిష్కరించారు. తన సంపూర్ణ సహకారం అందిస్తానని చెప్పారు.


వర్గల్ నాచగిరి క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


పెద్దశంకరంపేట మండలం కొప్పోల్ ఉమా సంగమేశ్వరస్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు


ఏడుపాయలలో దుర్గామాతను దర్శించుకుంటున్న భక్తులు


హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతరలో ఒగ్గు డోలు బృంద ప్రదర్శన


సిద్దిపేటలో శ్రీగౌరి సహిత నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం

ప్రజలందరినీ ఏకం చేసే తిరంగా యాత్ర

● బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్

మెదక్ అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): దేశరక్షణకు ప్రతిఒక్కరం సైనికులం అవుతామని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఉగ్రవాదుల దాడి తర్వాత దేశ ప్రజలందరూ ఒక్కటై సైనికుల వెంట నిలవడం గర్వంగా ఉందన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ... ప్రజల ప్రాణాలను తీయాలని చూస్తున్న పాకిస్తాన్‌కు మన సైనికులు తగిన గుణపాఠం చెప్పారన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలో తిరంగా యాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ రఘునందన్‌రావు హాజరు కానున్నట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా, కుల సంఘాలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో భార్య, కూతురుపై దాడి

● కూతురు పరిస్థితి విషమం

శివ్వంపేట , మే 18 (ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో విచక్షణ కోల్పోయిన భర్త భార్యపై దాడికి పాల్పడ్డాడు. అడ్డుకోబోయిన కూతురుపై కూడా దాడి చేశాడు. ఈ సంఘటన ఆదివారం మగ్దంపూర్‌లో చోటుచేసుకుంది. సోము రమేష్ అతిగా మద్యం సేవించి వచ్చి భార్యను కొట్టాడు. గమనించిన కూతురు హేమలత అతన్ని అడ్డుకోబోయింది. కోపానికి గురైన రమేష్ ఆమె ఛాతి మీద తన్ని గొంతు నులిమాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు అడ్డుకుని పాపను 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.




కక్కర్‌వాడ గ్రామంలో కర్రలపై విద్యుత్ వైర్లను ఏర్పాటు చేసిన రైతు


ఝరాసంగంలో ఓ పొలంలో చెట్టుపై వంగిన విద్యుత్ స్తంభం

పొంచి ఉన్న ప్రమాదం

● చేతికందే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలు

ఝరాసంగం, మే18 (ఆంధ్రజ్యోతి) ఝరాసంగంతో పాటు మండల పరిధిలోని కుప్పానగర్, కక్కర్‌వాడ, ఏల్గోయి, పోట్‌పల్లి, మాచూనూర్, బిడెకన్నె, తదితర గ్రామాల్లో పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు వంగిపోయి ప్రమాదకరంగా మారాయి. కొన్నిచోట్ల చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు ఉండడంతో రైతులు రాత్రివేళల్లో పొలాలకు వెళ్లాలంటే భయపడుతున్నారు. వేలాడుతున్న తీగలను సరిచేయాలని అధికారులకు ఎన్నోసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. తక్కువ ఎత్తులో వేలాడుతున్న తీగలు సాగు పనులకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు ట్రాక్టర్ సహాయంతో దుక్కులు చేద్దామంటే వైర్లు కిందకు వేలాడడం వల్ల కర్రలతో వాటిని పైకి చేసి దుక్కులు చేసుకోవాల్సిన పరిస్థితి. చెరుకు తోటల్లో కూడా తీగలు కిందకు ఉండడం వల్ల ఆ ప్రదేశంలో చెరుకును వదిలేయాల్సిన పరిస్థితి నెలకొంది. మిగతా పొలాలతో పోలిస్తే కరెంటు తీగలు వేలాడుతున్న పొలాల్లో అన్నదాతలు ఆర్థికంగా నష్టపోతున్నారు.

అటవీ భూమి ఆక్రమణకు యత్నం

శివ్వంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి) : శివ్వంపేట మండలం తాళ్లపల్లితండా పరిధిలోని ప్రభుత్వ భూమిని అక్రమార్కులు కబ్జా చేసేందుకు యత్నించారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి భూమిని చదును చేశారు. శివ్వంపేట సెక్షన్ పిల్లుట్ల బీట్ పరిధిలోని తాళ్లపల్లి తండా సమీపంలోని నీలగిరి ప్లాంటేషన్‌ను ఆనుకుని ఎకరం భూమి ఉన్నది. అయితే కొందరు ట్రాక్టర్‌తో ఆ భూమిని దున్ని చదును చేశారు. అటవీ సిబ్బంది సహకారంతోనే కబ్జా జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై శివ్వంపేట సెక్షన్ ఆఫీసర్ శ్రీధర్‌ఆచార్యులను వివరణ కోరగా.. అటవీ భూమిని దున్ని విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


తాళ్లపల్లితండా పరిధిలో అటవీ భూమిని దున్నిన అక్రమార్కులు

ఉండేనా.. కూలేనా?

శిథిలావస్థలో పలు గ్రామాల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు

- పిల్లర్లకు పగుళ్లు.. పెచ్చులూడి తేలిన ఇనుప చువ్వలు
- మరమ్మతులు చేయాలని వినతి


చెర్లగూడెంలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు

కంది, మే 18 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని పలు గ్రామాల్లో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. గ్రామీణ తాగు నీటి సరఫరా పథకంలో భాగంగా దాదాపు 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ట్యాంకుల పిల్లర్లకు పగుళ్లు ఏర్పడ్డాయి. మరికొన్ని చోట్ల పెచ్చులూడి ఇనుప చువ్వలు తేలాయి.

మండలంలోని చెర్లగూడెం, మామిడిపల్లి, ఎర్దనూర్, తునికిళ్లతండా, మక్తఅల్లూరు, కాశీపూర్, ఎద్దుమైలారం తదితర గ్రామాల్లో వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. చెర్లగూడెంలోని ట్యాంకు రేపో మాపో కూలుతుందనే స్థితిలో శిథిలావస్థకు చేరింది. ప్రమాదం జరగకముందే వాటికి మరమ్మతులు చేయించాలని, అలాగే పూర్తిస్థాయిలో పాడైన వాటిని కూల్చి కొత్తవి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. మామిడిపల్లిలో రెండు ట్యాంకులు ఉండగా పాత ట్యాంకు పిల్లర్లకు పగుళ్లు రావడంతోపాటు పెచ్చులూడాయి. ఈ ట్యాంకు కూలితే కొత్త ట్యాంకులపై పడేపోయో ప్రమాదం ఉంది.

అధికారులకు నివేదికలు పంపాం..

కంది మండలంలో పలుచోట్ల ఓవర్ హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమే. అవసరమైన వాటికి మరమ్మతులు చేయిస్తాం. మామిడిపల్లి, చర్లగూడెం గ్రామాల్లో పూర్తిగా పాడైన ట్యాంకులను కూల్చేందుకు క్వాలిటీ కంట్రోల్ శాఖ అధికారుల అనుమతి కోసం ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే పాడైనవాటిక మరమ్మతలు చేయిస్తాం.

-రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ



మామిడిపల్లిలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు పిల్లర్లకు పగుళ్లు


బెంగుళూరులో నిర్వహించిన పోటీలో బీవీఆర్ఐటీ విద్యార్థులు

జాతీయ స్థాయి ప్రాజెక్టులో
బీవీఆర్ఐటీకి రెండో స్థానం

నర్సాపూర్, మే 18(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ప్రాజెక్టు పోటీల్లో నర్సాపూర్‌కు చెందిన బీవీఆర్ఐటీ రెండవ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బెంగుళూరులో నిర్వహించిన ఎల్‌అండ్‌టీ టెక్నాలజీ నిర్వహించిన ఫైనల్ పోటీల్లో దేశవ్యాప్తంగా 569 విద్యాసంస్థల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చూపారన్నారు. ఇందులో బీవీఆర్‌టీ చెందిన విద్యార్థులు రెండవస్థానం సాధించారన్నారు. ఈ పోటీల్లో బీవీఆర్ఐటీకి చెందిన ఈసీఈ విభాగంకు చెందిన విద్యార్థులు అవార్డుతో పాటు మూడు లక్షల నగదు బహుమతి పొందినట్లు తెలిపారు.

ఆస్పత్రి భవనంపైకి ఎక్కి యువకుడి హల్‌చల్


ఆసుపత్రి భవనం పైకి ఎక్కిన మధు

జోగిపేట రూరల్, మే18 (ఆంధ్రజ్యోతి): జోగిపేట ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రి పైకి ఎక్కి ఆదివారం ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మెదక్ జిల్లా టేక్మాల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బోయిని మధు భార్య కుటుంబ తగాదాలతో పుట్టింటికి వెళ్లి తిరిగి కాపురానికి రావడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన అతడు మద్యం మత్తులో తన ఇంట్లో గడ్డి మందు సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడాడు. గమనించిన కుటుంబ సభ్యులు మధును కాపాడేందుకు 108 అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడికి చికిత్స అందించిన వైద్యులు సంగారెడ్డికి రిఫర్ చేశారు. అక్కడి నుంచి సంగారెడ్డికి తరలిసున్న క్రమంలో మధు అంబులెన్స్ సిబ్బందికి సహకరించకపోవడంతోపాటు సిబ్బంది తనపై దాడి చేసి దురుసుగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ ఆసుపత్రి భనంపై పైకి ఎక్కాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకోని మధుకు నచ్చజెప్పి కిందికి దింపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


ఇస్తారి(ఫైల్)

గజ్వేల్ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని శ్రీగిరిపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పేరక ఇస్తారి(44) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మానవతావాదులు ఇస్తారి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి

● చీడ పీడల నివారణ ● తగ్గనున్న పెట్టుబడితో రైతులకు మేలు


అక్కన్నపేట మండలం ధర్మారంలో సాగు చేసిన కొత్తిమీర పంట

అక్కన్నపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటమార్పిడీ విధానంతో ఎక్కువ దిగుబడి సాధించడంతో పాటు చీడపీడల నివారణతో పెట్టుబడి ఖర్చుతూ గణనీయంగా తగ్గించుకోవచ్చని వ్యవసాయ అధికారులు, నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి పంటకు పంట మార్పిడి పద్ధతి పాటించాలని, ఒకే పంట పండిస్తే నేలలోని పోషకాలు పంటకు సరిగ్గా అందవు. అలాగే విభిన్న పంటలు రకరకాల పోషకాలను వినియోగించుకుంటాయి కాబట్టి అన్ని పోషకాలు వినియోగం కావాలంటే వివిధ పంటలు పండించాలి. ఒకే పంటను పండిస్తే రసాయన ఎరువుల వినియోగం పెరుగుతుంది. అలాగే నేల సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఒకే పంట రకం సాగుతో దిగుబడి కూడా పడిపోతుంది. ఈ వేసవిలో పంట మార్పిడిపై రైతులకు ఆయా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను వ్యవసాయ అధికారులు నిర్వహిస్తున్నారు.

ఎన్నో ప్రయోజనాలు..

ప్రతీ పంటకు భూమిలో అన్ని రకాల సూక్ష్మధాతువుల వినియోగం పూర్తికావాలంటే కొన్నిసార్లు గుబురు వేరు మొక్క పంటలు, మరో పంటకు తల్లివేరు రకం పంటలను సాగు చేయాలి. వరి, పొద్దు తిరుగుడు, టమాట, మిరప తదితర పంటలు గుబురువేరు మొక్కలు కలిగిన పంటలు. అలాగే మొక్కజొన్న, పత్తి, కంది, నువ్వులు, పజొన్న, పెసర, కాకర, దోస, బీర, చిక్కుడు వంటి ఆహార, కూరగాయ పంటలు తల్లివేరు మొక్కల పంటలు. ఒకే రకం పంటల్లో శిలీంధ్ర రోగాలు, కీటకాలు ఎక్కువ ఆశిస్తాయి. పంటమార్పిడితో రోగాలు అన్ని పంటలకు రావు. పంట మార్పిడితో సహజంగా కొన్ని రకాల పురుగులు, కలుపు మొక్కలు నేలలో నాశనం అవుతాయి. మొక్కలు ఏపుగా పెరుగుతాయి. వేసవి దుక్కులతో పంటలను ఆశించే పురుగులు ఎండ వేడికి చనిపోతాయి. సేంద్రియ పదార్థం పెరిగి భూ భౌతిక స్థితి గణనీయంగా మెరుగుపడుతుంది. మొక్కలకు నత్రజని వినియోగం తగ్గుతుంది.

ఈ సూచనలు పాటించాలి..

దీర్ఘకాలిక పంటలు సాగుచేసే పొలాల్లో పంట మార్పిడి కింద స్వల్పకాలిక పంటలైన కూరగాయలు సాగు చేయాలి. లెగ్యూమ్ జాతి పైర్లు వేస్తే రైజోబియం బుడిసెలు ఏర్పడతాయి. ఈ మొక్కలు పచ్చిరొట్ట ఎరువుగా మారేందుకు భూమిలో కలియదున్నాలి. చిక్కుడు జాతి మొక్కలతో నేలలో భూసారం పెరుగుతుంది. ఒకసారి జొన్న వేస్తే మరుసటి ఏడాది ఆముదం లేదా కంది, మొక్కజొన్న వంటి పంటలు వేసుకోవాలి. రెండు సార్లు దీర్ఘకాలిక పంటలేస్తే మరోమారు స్వల్పకాలిక పంటలైన కూరగాయల సాగుచేయాలి. వరి తరువాత పప్పు దినుసులు సాగుచేసుకోవాలి. దీనితో నేలలో నెమటోడ సంఖ్య తగ్గుతుంది. తేలిక భూముల్లో నీటిపారకం కింద వేరుశనగ లేదా చిక్కుడు పంటలు వేసుకో వాలి. బెండ, బీర, దొండ లాంటి పంటల తర్వాత బంతిపూలు, నువ్వులు వేసుకోవాలి. వయ్యారిబామ కలుపు మొక్కల నివారణకు గడ్డిజాతి మొక్కలు సాగు చేయాలి. తక్కువ సారముండే భూముల్లో జనుము, జీలుగ, పచ్చి రొట్ట విత్తనాలు వేసి మొక్కల పూత సమయంలో భూమిలో కలిసేలా నాలుగు సాళ్లు దున్నాలి.

మిశ్రమ పంటలు వేసుకోవాలి..



వేరుశనగ పంటను వెంటవెంటనే అస్సలు వేయొద్దు. అలా చేస్తే ఎర్రగొంగలి పురుగు, శనగపచ్చపురుగు, లద్దె పురుగు, ఆకుమచ్చ తెగులు, మొవ్వ కుళ్లు తెగుళ్లు వస్తాయి. బెండ తరువాత పత్తిపంట వేయాలి. నులిపురుగులు ఉండే ప్రాంతంలో వంగ, బెండ, టొమాటో, ఉలవ, మినుము, పెనర పంటలు వేసుకోవాలి. తేలిక నేలలు, ఎర్ర, ఇసుక, ఎర్రబంకమట్టి నేలలు, రేగడి నేలల్లో మిశ్రమ పంటలు వేసుకోవాలి.

-బి.శ్రీనివాస్, వ్యవసాయ శాఖ హుస్నాబాద్ డివిజన్ అధికారి

ఇంటిగోడను ఢీకొట్టిన ట్రాక్టర్.. డ్రైవర్ మృతి


రాఘవ మృతదేహం

నంగునూరు,మే 18 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ రోడ్డు డివైడర్‌ను దాటి ఓ ఇంటి గోడను ఢీకొన్న సంఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి నంగునూరు మండలం పాలమాకులలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సంపంగి రాఘవ(16) రాత్రి వడ్లను ట్రాక్టర్లులో కొనుగోలు కేంద్రానికి తరలించాడు. తిరిగి వస్తున్న క్రమంలో డివైడర్‌ను దాటి మరోపక్క దూసుకెళ్లడంతో రాఘవ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. దూసుకెళ్లిన ట్రాక్టర్ రోడ్డు పక్కన ఉన్న ఇంటి వరండా, గోడను ఢీ కొట్టి నిలిచిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఆసిఫ్, ప్రొబీషనల్ ఎస్‌ఐ సౌజన్య సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని రాఘవకు సీపీఆర్ చేస్తూ అంబులెన్స్‌లో సిద్దిపేట ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు.


మార్డి పెద్ద చెరువులో కట్టలు వేసి కబ్జాకు యత్నిస్తున్న దృశ్యం

మార్డి పెద్దచెరువు కబ్జా..!

- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- నీటి నిల్వ ప్రాంతంలోనే కట్టలు వేసి యథేచ్ఛగా ఆక్రమణ

కల్హేర్, మే 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మార్డి పెద్ద చెరువు కబ్జాకు గురవుతున్నదని స్థానికులు తెలిపారు. హైదరాబాద్‌కు కెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి చెరువు నీటి నిల్వ ప్రాంతంలో ఎక్స్‌కావేటర్‌తో కట్టలు వేసి యథేచ్ఛగా కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోగా కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తికే వంత పాడుతున్నారని ఆ చెరువు ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కబ్జాకు పాల్పడిన వ్యక్తిని మార్డి గ్రామ రైతులు ప్రశ్నించగా తనకు పట్టా పాసు పుస్తకం ఉందని దీని ఆధారంగా తన సర్వే నంబర్‌లోనే కబ్జా చేస్తున్నట్లు తెలిపాడని రైతులు తెలిపారు. అంతేకాకుండా తహసీల్దార్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు తన భూమి ఇక్కడే ఉన్నట్లు చెప్పారని సమాధానం ఇవ్వడంతో ఆశ్చర్యపోవడం రైతుల వంతైంది. పూర్తి స్థాయి చెరువు ఉన్న ప్రాంతంలో భూమి ఆక్రమించి చదును చేయడం ఏమిటని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కబ్జా విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. దీనిపై కల్హేర్ తహసీల్దార్ శివ శ్రీనివాస్‌ను వివరణ కోరగా రైతుల ఫిర్యాదుకు స్పందించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పంపించి పరిశీలన జరిపించామన్నారు. పూర్తి వివరాల కోసం నీటిపారుదల శాఖ అధికారులకు లేఖ రాసినట్లు తెలిపారు. వారి నివేదిక ఆధారంగా కబ్జాకు పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్ చోరీ


పగలగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్

కోహెడ, మే 18 (ఆంధ్రజ్యోతి) : కోహెడ మండలంలోని తీగలకుంటపల్లి గ్రామంలో గుర్తుతెలియని దుండగులు రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్‌వైర్‌ను దొంగిలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఉదయం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లిన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి కనిపించాయి. దగ్గరికి వెళ్లి చూసిన వారు అందులోని కాపర్ వైర్‌ను దుండగులు చోరీ చేసినట్లు గుర్తించారు. గోవిందు రాజాసాగర్, కరెడ్ల బాపురెడ్డికి చెందిన వ్యవసాయ క్షేత్రాల్లోని రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్‌ను చోరీ చేశారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌కో ఏఈ రవీందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వరుస ఘటనలతో రైతుల్లో ఆందోళన

మండలంలో వరుస ఘటనలు చోటుచేసుకుంటుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా తీగలకుంటపల్లిలో రెండు, ఇటీవల గొట్లమిట్టలో రెండు, కూరెళ్లలో ఒకటి చొప్పున ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. నెల రోజుల్లో 5 ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్‌ను చోరీ చేయడంపై అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిఘా ఏర్పాటుచేసి నిందితులను అందుపులోకి తీసుకోవాలని కోరుతున్నారు.


అవాంచ జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

టెన్త్ సప్లిమెంటరీకి సన్నద్ధం

● విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ● జూన్ 3 నుంచి పరీక్షలు

మెదక్ అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఉత్తీర్ణత శాతం మెరుగయ్యేలా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేస్తోంది. జూన్ 3 నుంచి పరీక్షలు ప్రారంభం కానుండగా.. ప్రత్యేక తరగతుల నిర్వహణకు డీఈవో రాధాకిషన్ ఆదేశాలిచ్చారు. ఈ మేరకు అనుత్తీర్ణులైన విద్యార్థులకు బోధన అందిస్తున్నారు. ఉత్తీర్ణత శాతం తక్కువగా నమోదైన బడుల్లో ఆన్‌లైన్, ప్రత్యక్ష తరగతుల ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. మెదక్ జిల్లాలో గతం కంటే మెరుగైన ఫలితాలతో ఈ సారి 12వ స్థానంలో నిలిచింది. మొత్తం 10,370 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 10,045 మంది విద్యార్థులు పాసయ్యారు. 325 మంది అనుత్తీర్ణులయ్యారు. ప్రథమ భాషలో 173 మంది. ఇంగ్లిష్‌లో 127, సైన్స్ 116, గణితం 106, సాంఘికశాస్త్రం 34, ద్వితీయభాషలో 22 మంది ఫెయిలయ్యారు. వీరికి సబ్జెక్టులపై భయం తొలగించి ఉత్తీర్ణలయ్యేలా చర్యలు చేపట్టారు.

ఉత్తీర్ణత శాతం పెంచేలా చర్యలు

టెన్త్‌లో అనుత్తీర్ణులైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించాం. సబ్జెక్టులు తప్పిన వారంతా ఉత్తీర్ణలయ్యేలా టీచర్లు చొరవ తీసుకుంటున్నారు. ప్రత్యేక తరగతుల ఆన్‌లైన్‌లో పాఠాలు బోధిస్తున్నారు. వాట్సాప్ ద్వారా విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తున్నారు. సాధ్యమైనంత వరకు ఉత్తీర్ణత శాతం పెంచేలా చొరవ తీసుకుంటున్నాం.

-రాధాకిషన్, డీఈవో మెదక్

పదిరోజులని.. నెలలకొద్ది మూసివేత

- మరమ్మతుల పేరుతో రైల్వేగేట్ క్లోజ్
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ఈదులనాగులపల్లి గ్రామస్థులు
- శాశ్వతంగా మూసివేసే ధోరణిలో అధికారులు!
- ఇదే జరిగితే ఈదులనాగులపల్లి, వెలిమల గ్రామస్థులకు పెరగనున్న దూరాభారం


నాగులపల్లి వద్ద మూసి వేసిన రైల్వే గేట్

రామచంద్రాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలంలోని కొల్లూరు అవుటర్ రింగ్ రోడ్డు జంక్షన్ నుంచి ఈదులనాగులపల్లి గ్రామాన్ని కలుపుకుంటూ రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల వరకు వంద ఫీట్ల రోడ్డు నిర్మాణానికి ఐదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈదులనాగులపల్లి వద్ద రోడ్డు కాకుండా ఫ్లైఓవర్ నిర్మిస్తామని చెప్పడంతో గ్రామస్థులు వ్యతిరేకించారు. మా భూములు తీసుకుని మా రోడ్డును మా గ్రామం నుంచి తీసుకువెళ్లకుండా ఫ్లై ఓవర్ నిర్మిస్తామని చెప్పడమేమిటని ప్రశ్నించారు. అయినా అధికారులు పట్టించుకోకుండా కొన్నిరోజుల తరువాత సర్వీస్ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చినా అమలు చేయకపోవడంతో ఈ గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈదులనాగులపల్లి గ్రామస్థులు వెలిమలకు వెళ్లాలంటే ప్రధానంగా రైల్వే గేట్ నుంచి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది.

రైల్వేగేట్ మూసి వేతతో అవస్థలు

రైల్వే లైన్ మరమ్మతుల కారణంగా ఓ పది రోజులు రైల్వేగేట్ మూసి వేస్తున్నట్టు గత మార్చి 8న ఓ ప్రకటనను విడుదల చేశారు. అయితే గ్రామం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం పరిధిలో ఉండగా, ఈ ప్రకటన ప్రతులను మాత్రం పటాన్‌చెరు డీఎస్పీ, పటాన్‌చెరు ఆర్టీసీ మేనేజర్, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, శంకర్‌పల్లి(రంగారెడ్డి జిల్లా) తహసీల్దార్‌కి అందించి చేతులు దులుపుకున్నారు. ఆ ప్రకటన ప్రకారం పదిరోజుల్లో రైల్వేగేట్ తెరువాల్సి ఉన్నా నేటికి తెరువలేదు. ఈదులనాగులపల్లి రైల్వేగేట్‌ను శాశ్వతంగా తొలగించాలని ఆలోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తుంది. ఇదే నిజమైతే ఈదులనాగులపల్లి, వెలిమెల, గ్రామస్థులు సుమారు మూడు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సివస్తుంది.

శిథిలమైన ర్యాంపు రోడ్డుపై ప్రయాణం

రైల్వే గేట్ వద్ద గేటు మూయడంతో వెలిమెల, పాటి తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఓఆర్ఆర్ వద్ద శిథిలమైన ర్యాంపు రోడ్డును ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. దీంతో ఈ రోడ్డుపై తీవ్రమైన ఒత్తిడి పడుతోంది. ఒక వేళ ఈ రోడ్డు ధ్వంసమైతే ఇక్కడి గ్రామాల ప్రజలు 10 నుంచి 20కిలో మీటర్ల దూరం అదనంగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఈ రోడ్ల మార్పులు, చేర్పులు అభివృద్ధి పేరిట భూస్వాములకు లబ్ధిచేకూర్చడానికే అని స్థానికులు పేర్కొంటున్నారు. రైల్వే గేట్ తెరుచుకోవడం, ఓఆర్ఆర్ జంక్షన్ వద్ద నిర్మిస్తున్న రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పూర్తయితేనే దూర సమస్యకు పరిష్కారమవుతుంది. ఇప్పటికే పటాన్‌చెరు నుంచి లింగంపల్లికి రాకపోకలు సాగిస్తున్న రూట్లలో బస్సులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు.

రేషన్‌కార్డులో పేరు తొలగించాలంటే డబ్బులివ్వాల్సిందే!

మద్దూరు, మే 18 ఆంధ్రజ్యోతి) : కుటుంబ సభ్యుల రేషన్‌కార్డు నుంచి పేరు తొలగించుకునేందుకు దరఖాస్తు చేసుకుంటున్న పేద కుటుంబాలను నుంచి రెవెన్యూ కార్యాలయంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్కడాక్కడా రెవెన్యూ ఉద్యోగులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుపడుతున్నా వారి తీరు మారడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. వివాహం చేసుకున్న దంపతులు కొత్తగా రేషన్‌కార్డుకు పొందేందుకు పాత రేషన్ కార్డుల నుంచి తమ పేర్ల తొలగించుకునేందుకు మండల రెవెన్యూ కార్యాలయాలకు వెళ్తున్నారు. ఇదే అదునుగా వారి నుంచి అధికారులు, సిబ్బంది రూ.100 నుంచి 200 వరకు వసూల్ చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకునే సమయాల్లో సంతకాలకు రైతుల వద్ద నుంచి రూ.1000 తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ విషయమై తహసీల్దార్ రహీంను సంప్రదించగా తన దృష్టికి రాలేదని, ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు.

న్యూస్ బాక్స్

20 నుంచి కట్టమైసమ్మ ప్రతిష్ఠాపనలు

నారాయణఖేడ్, మే 18 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలోని జీవన్ కన్వెన్షన్ సమీపంలో ఈనెల 20 నుంచా కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనను నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు నాగం బ్రదర్స్ ఆదివారం తెలిపారు. 20 నుంచి 22 వరకు నిర్వహించే ఉత్సవాల సందర్భంగా హోమాలు, పూజలు, 23న బోనాల ప్రదర్శన ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు.

చౌటకూర్‌లో కుళ్లిన మాంస విక్రయాలు

పుల్‌కల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన చౌటకూర్‌లో కుళ్లిన మాంసం విక్రయించిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. చౌటకూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మాంసం దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఓ వ్యక్తి మాంసం దుకాణానికి వచ్చి మేక తలకాయ అడిగాడు. సదరు యజమాని బుధవారం నాటి తలకాయ ఇచ్చాడు. అది పరిశీలించిన వినియోగదారుడు మెత్తగా ఉండడంతో నిలదీశాడు. ఈ విషయం తెలుసుకున్న వినియోగదారులు, స్థానికులు మాంసం దుకాణాన్ని మూసేసి, దుకాణ యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంటర్ ప్రవేశానికి రేపు కౌన్సెలింగ్

నారాయణఖేడ్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఎంపీసీ, బైపీసీ, కోర్సుల్లో పరిమితంగా ఉన్న సీట్లలో ప్రవేశం కోసం మంగళవారం ఉదయం 10 గంటలకు కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ యాదగిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతిలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జిమ్ సెంటర్‌తో ఆరోగ్యం

మనోహరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి) : జిమ్ సెంటర్‌తో ఆరోగ్యం లభిస్తుందని, గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచుల ఫోరం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మనోహరాబాద్ మండల కేంద్రంలో జిమ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్ జావిత్‌పాషా, మాజీ ఉపసర్పంచ్ వెంకట్‌రెడ్డి, శశిభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ గోపురానికి రూ.లక్ష విరాళం

నంగునూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): నంగునూరులోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ గోపురము నిర్మాణం కోసం వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి విరాళాన్ని అందజేశారు. నంగునూరు మండల కేంద్రంలోని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్మించే శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ గోపురము నిర్మాణానికి ఆదివారం రూ.1లక్ష అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రెడ్డిని రెడ్డి సంఘం సభ్యులు సన్మానం చేశారు. అంతకుముందు గ్రామంలోని నల్ల పోచమ్మ అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోదుమకుంట మల్లారెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు పందిళ్ళ రాంరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు

నేడు వేణుగోపాలస్వామి విమాన రథోత్సవం

వర్గల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారి విమాన రథోత్సవానికి ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. వేలాది మంది భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 4.30 గంటలకు రథ ప్రతిష్ఠ తదుపరి విమాన రథంపై దేవతా మూర్తులైన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారిని అధిష్ఠింపజేసి ఉదయం 8.00 గంటలకు ఆలయం వద్ద నుంచి రథోత్సవం ప్రారంభం అవుతుందని ఆలయ వేద పండితులు వేదాంతం మురళీధర చార్యులు తెలిపారు. రథోత్సవంలో భక్తుల భజనలు, మహిళలచే కోలాటంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రథోత్సవం అనంతరం ఆలయంలో సుదర్శన హోమం, మహా పూర్ణాహుతి, భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

జగదేవ్‌పూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మునిగడప గ్రామానికి చెందిన ఉమ్మరాజు లక్ష్మి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా విషయం తెలుసుకున్న గజ్వేల్ నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్, మండల రజక సంఘం నాయకులు ఆదివారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట రజక సంఘం నాయకులు వడ్లకొండ శ్రీనివాస్, రాచకొండ బాల్‌నరసయ్య, అక్కారం నరసింహులు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



గుంతలమయంగా అల్లాదుర్గం- రెడ్డిపల్లి ప్రధాన రహదారి

రోడ్డంతా గుంతలమయం

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- పట్టించుకోని అధికారులు

అల్లాదుర్గం, మే 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత రహదారుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా కొందరు అధికారుల నిర్లక్ష్యంతో నిర్మాణానికి నోచుకోవడం లేదు. మండల కేంద్రానికి కూడలిగా ఉన్న పలు గ్రామాల రహదారులు కంకర తేలి.. గుంతలమయంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అల్లాదుర్గం-రెడ్డిపల్లి గ్రామానికి గల 3 కిలోమీటర్ల రహదారి, అల్లాదుర్గం- చేవెళ్ల గ్రామానికి గల 4 కిలోమీటర్ల దూరం గల ఈ రహదారిపై నిత్యం పదుల సంఖ్యలో వాహనదారులు ప్రయాణం చేస్తుంటారు. కానీ ఈ రోడ్డుపై కంకర తేలిన గోతులతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతన్నారు. ఇదిలా ఉంటే మండల కేంద్రమైన అల్లాదుర్గం-మెట్టుగడ్డ నుంచి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి సైతం ధ్వంసమైంది. ఈ విషయాన్ని గతంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. అల్లాదుర్గం పట్టణ శివారులో ఎంతో ప్రసిద్ధి చెందిన రేణుకామాత ఆలయానికి వెళ్లే రహదారి సైతం ఛిద్రమైంది. రెడ్డిపల్లి- వెంకట్రావుపేట మీదుగా రేగోడ్ మండలం జగిర్యాల గ్రామాల రహదారి ముళ్లబాటను తలపిస్తోంది. ఈ దారిలోనే ఆర్టీసీ బస్సులు నడుస్తుంటాయి. జిల్లా అధికారులు స్పందించి రహదారుల నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.



కంకరతేలి అధ్వానంగా అల్లాదుర్గం- చేవెళ్ల ప్రధాన రహదారి



గుంతలతో దర్శనమిస్తున్న జంగరాయి రోడ్డు

కంకర వేసి.. మధ్యలో వదిలేసి.

- అధ్వానంగా జంగరాయి రోడ్డు పనులు
- నిధులు మంజూరైనా సాగని పనులు

చిన్నశంకరంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండల కేంద్రం నుంచి జంగరాయికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. 13 ఏళ్ల క్రితం రోడ్డుకు తారువేసి మరమ్మతులు చేపట్టారు. అయితే దారి ధ్వంసమై దారి పొడవునా గుంతలు ఏర్పడ్డాయి. బీఆర్ఎస్ హయాంలో అప్పటి ఎమ్మెల్యే పద్మారెడ్డి రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేశారు. కాంట్రాక్టర్ పనులను ప్రారంభించి, కంకర వేసి మధ్యలోనే వదిలేశాడు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే రోహిత్ స్పందించి జంగరాయి రోడ్డుకు మరమ్మతు చేపట్టేందుకు నిధులు మంజూరు చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జిల్లా అధికారులు రోడ్డును పరిశీలించి రోడ్డు మరమ్మతులు ప్రారంభించేందుకు కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. అయితే ఏళ్లు గడుస్తున్నా రోడ్డు మరమ్మతులకు మోక్షం కలగలేదు. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయించాలని కోరుతున్నారు.

పదేళ్లలో 200 ఆలయాలను నిర్మించాం

- పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- ఆలయ రాజగోపుర నిర్మాణానికి రూ.28 లక్షల విరాళం



రాధాక్రిష్ణ ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి

అమీన్‌పూర్, మే 18 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లలో నియోజకవర్గంలో 200 ఆలయాలను సొంతంగా నిర్మించానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అమీన్‌పూర్‌లోని జీవిగుట్టపై నిర్మించిన రాధాక్రిష్ణ ఆలయ రాజగోపుర నిర్మాణానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి భారీ విరాళాన్ని ప్రకటించారు. ఆదివారం ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ నాయకులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లలో నియోజకవర్గంలో 200 ఆలయాలను సొంతంగా నిర్మించామన్నారు. 400 ఏళ్ల పురాతనమైన పటాన్‌చెరు మహదేవుడి ఆలయాన్ని కోట్లాది రూపాయలతో పునరుద్ధరించామని చెప్పారు. అమీన్‌పూర్ జీవిగుట్టపై వెలసిన రాధాక్రిష్ణ ఆలయ పునరుద్ధరణకు ప్రత్యేక సహాయం అందిస్తానన్నారు. ఆలయ రాజగోపుర నిర్మాణానికి రూ.28 లక్షల భారీ విరాళం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేష్, మాజీ కౌన్సిలర్ బాశెట్టి కృష్ణ, నర్సింహారెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

చేగుంట, మే 18 (ఆంధ్రజ్యోతి) : అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో చిన్నశంకరంపేట మండలం మడూర్ సొసైటీ మాజీ ఛైర్మన్, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షురాలు, కీర్తిశేషులు తిగుళ్ల విజయలక్ష్మి, బాబు కూతురు వివాహానికి హరీశ్‌రావు, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారెడ్డి, బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంప గోవర్దన్ తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. బీఆర్ఎస్ చిన్నశంకరంపేట మండలాధ్యక్షుడు పట్లోరి రాజు, రైతుబంధు మండలాధ్యక్షుడు లక్ష్మణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం జరగొద్దు: ఎమ్మెల్యే



కల్హేర్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్, మే 18 (ఆంధ్రజ్యోతి) : యాసంగిలో రైతులు పండించిన ధాన్యం, జొన్నల కొనుగోలులో ఎక్కడా నష్టం జరుగకూడదని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, గిరిజనతండాలో చివరి గింజవరకూ కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి అన్నారు. కల్హేర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. తరుగు పేరిట రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దని సూచించారు. నిబంధనల ప్రకారం రైతులు, నిర్వాహకులు నడుచుకుని విజయవంతంగా కొనుగోళ్లను పూర్తి చేసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం, జొన్నలకు త్వరితగతిన డబ్బులు పడేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో సీడీసీ మాజీ ఛైర్మన్ నర్సింహారెడ్డి, నాయకులు మహేశ్వర్‌గుప్తా, వీరశెట్టి, దేవదాస్, తుకారాం, జితేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్యాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా మిషన్ భగీరథ నిర్వహణ

- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ప్రజల దాహార్తిని తీర్చడం కోసం తమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం నిర్వహణను ప్రస్తుత ప్రభుత్వం గాలికి వదిలేసిందని స్థానిక మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అబ్బెంద శివారులో మిషన్ భగీరథ పైప్‌లైన్ వారంరోజులుగా లీకేజీ అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. మిషన్ భగీరథ పథకం నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రిడ్ డిప్యూటీ ఈఈ పదోన్నతిపై బదిలీ అయి ఆరునెలలు కావస్తున్నా కొత్త అధికారిని నియమించలేదన్నారు. కలెక్టర్ స్పందించి అబ్బెంద సమీపంలో ఏర్పడిన లీకేజీని తొలగింపజేసి, నిర్వహణ తీరు మెరుగుపర్చాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు సంగప్ప, తదితరులు ఉన్నారు.

20న కొబ్బరికాయ బహిరంగ వేలం

- ఈవో సార శ్రీనివాస్

శివ్వంపేట్, మే 18 (ఆంధ్రజ్యోతి) : అరణ్యంలో స్వయంభుగా వెలసిన పుణ్యక్షేత్రం చిన్న గొట్టిముక్ల గ్రామంలోని చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి సన్నిధిలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయాల కోసం ఈనెల 20న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి సారా శ్రీనివాస్, చైర్మన్ ఆంజనేయశర్మ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మంగళవారం 11 గంటలకు ఆలయంలో నిర్వహించే వేలంలో పాల్గొనేవారు రూ.లక్ష డిపాజిట్ చేయాలన్నారు. వేలం పాట దక్కించుకున్న వారు దేవాదాయశాఖ నిబంధనల మేరకే కొబ్బరికాయలు, పూజా సామగ్రి విక్రయించాలని ఈవో శ్రీనివాస్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి భార్యాభర్తలకు గాయాలు

- అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా ఘటన





చికిత్స పొందుతున్న దంపతులు

శివ్వంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి) : బంధువు అంత్యక్రియలకు వెళ్లి వస్తుండగా బైక్ అదుపుతప్పి భార్యాభర్తలకు గాయాలయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకున్నది. శివ్వంపేట మండలం గూడూరు గ్రామానికి చెందిన నీరుడు నర్సింహులు, పద్మ దంపతులు హస్తాల్‌పూర్‌లో బంధువు మృతిచెందడంతో అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తున్నారు. పాంబండ శివారుకు రాగానే వీరు ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించడంతో 108 సిబ్బంది క్షతగాత్రులను తూప్రాన్ ఆసుపత్రికి తరలించారు.

ఉపాధి కూలీలకు వసతులు కరువు

- పని ప్రదేశంలో కనిపించని భద్రత
- పట్టించుకోని అధికారులు



జంగరాయి గ్రామంలో ఎండలో ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న కూలీలు

చిన్నశంకరంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ఉపాధిహామీ పథకం కూలీలకు పని ప్రదేశంలో కనీస వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పని ప్రదేశంలో కూలీలకు భద్రత కూడా కరువైంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని 29 గ్రామాల్లో మొత్తం 5 వేల జాబ్‌కార్డులు ఉండగా.. ప్రతిరోజూ 22,00 మంది కూలీలు పనులకు వస్తున్నారు. వేసవి కావడంతో ఉదయం ఏడు గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పని ప్రదేశంలో ఉపాధి కూలీలకు తాగునీరు, సేద తీరేందుకు టెంట్ సౌకర్యం, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం ఆదేశించినా ఉపాధిహామీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. పనులు చేపడుతున్న సమయంలో ప్రమాదశవశాత్తు కూలీలకు గాయాలైతే ప్రథమ చికిత్స కిట్లు కూడా లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస వసతులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఉపాధి హామీ ఏపీవో రాజ్‌కుమార్‌ను వివరణ కోరగా.. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడం నిజమేనని, ప్రభుత్వం నుంచి సకాలంలో టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందకపోవడంతో సౌకర్యాలు అందలేకపోయా అన్నారు.

కేంద్ర, రాష్ట్ర విధానాలతో అందని ద్రాక్షగా విద్య



సంగారెడ్డిలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా విద్యా వైజ్ఞానిక శిక్షణలో మాట్లాడుతున్న శోభన్‌నాయక్

సంగారెడ్డి రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర విధానాలతో పేదలకు విద్య అందని ద్రాక్షలా మారిందని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు శోభన్‌నాయక్ విమర్శించారు. సంగారెడ్డిలో ఎస్ఎఫ్ఐ జిల్లా విద్యావైజ్ఞానిక శిక్షణ తరగతుల సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారి వ్యవస్థ అమలవుతున్న దేశాల్లో నిరుద్యోగ సమస్య పెరుగుతుందన్నారు. సోషలిస్ట్ దేశాలు విద్య, వైద్యం అందించడంలో ముందున్నాయని, నిరుద్యోగ సమస్య పరిష్కరించే దిశగా పనిచేస్తున్నాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రైమరీ నుంచి యూనివర్సిటీ వరకు నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రోత్సహిస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థి వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న పాలకులకు ఐక్య పోరాటాలు చేసి బుద్ధిచెప్పేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ శిక్షణా తరగతుల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేష్, రాజేష్, జిల్లా సహాయ కార్యదర్శి అర్జున్, సాక్షి, పవన్, పూజా, భవ్యశ్రీ, చంద్రశేఖర్, రాఘవేంద్ర తదతరులు పాల్గొన్నారు.

బాణాపూర్‌లో ముగిసిన సప్తాహ



సప్తాహలో భక్తులు

నారాయణఖేడ్, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బాణాపూర్‌లోని రుక్మిణీ పాండురంగ ఆలయంలో వారంరోజుల పాటు నిర్వహించిన 22వ అఖండ హరినామ సప్తాహ ఆదివారం ముగిసింది. చివరిరోజు ప్రత్యేక భజనలు, కీర్తనలు నిర్వహించారు. వారీకార్ సంప్రదాయం ప్రకారం ప్రవచనాలు, హరిపాఠ్, పండరీపూర్, పుణ్యక్షేత్రానికి చెందిన అంబాదాస్ మహరాజ్‌చే కాలకీర్తన, మరాఠీ తెలుగులో భజనలు కాగడ హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో బీరప్ప కామహారతి, కల్యాణం ఆదివారం కూడా కొనసాగింది.

103వ రోజుకు నిరాహార దీక్ష



దీక్షలో కూర్చున్న జేఏసీ నాయకులు

గుమ్మడిదల, మే 18 (ఆంధ్రజ్యోతి) : ప్యారానగర్, నల్లవల్లి ప్రాంతాల్లో నిర్మిస్తున్న డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 103వ రోజుకు చేరాయి. ఈ దీక్షకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి హాజరై సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రజల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని డంపింగ్‌యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు సదానంద రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సూర్యనారాయణ, చక్రపాణి, వినోద్‌గౌడ్, వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

కాళ్లకల్‌లో ఉచిత వైద్య శిబిరం



గ్రామస్థులకు మందులు పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్ మల్లేష్

మనోహరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి) : కాళ్లకల్ గ్రామంలో మేడ్చల్‌లోని ఘనపూర్‌లో ఉన్న మెడిసిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైత్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మాజీ సర్పంచ్, సర్పంచుల ఫోరం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నత్తి మల్లేష్‌ముదిరాజ్ ప్రారంభించారు. ఇందులో గ్రామస్థులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సంతోష్, కరణ్, రాహుల్, ప్రవీణ్ శ్రీయా, శ్రీధర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభం

కోహీర్, మే 18: (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలంలోని వెంకటాపుర్ గ్రామంలో ఆదివారం మాజీ సర్పంచ్ రాజశేఖర్ సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో సరైన రోడ్డు లేదని, కాలనీ వాసుల కోరిక మేరకు జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు కృషితో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన రూ.5 లక్షలతో 100 మీటర్ల సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు రత్నం, బాల్‌రాజ్, శివలింగప్ప, కిషన్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

మెదక్ అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ దర్భంగాలో శిక్షా న్యాయ్ సంవాద్‌ను నిర్వహించకుండా బీహార్‌లోని జేడీయూ-బీజేపీ ప్రభుత్వం అడ్డుకున్న తీరును నిరసిస్తూ.. జిల్లా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం రాందాస్ చౌరస్తాలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తరుణ్ మాట్లాడుతూ... ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు నమోదు చేస్తూ... కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దేశంలో దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలపై జరుగుతున్న దాడులను తక్షణమే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పోరాటలు చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరశురాంగౌడ్, యువజన నాయకులు, మండల నేతలు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఇప్పించమని యువకుడి ఆత్మహత్యాయత్నం

శివ్వంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఫైనాన్స్ వారు తీసుకెళ్లిన బైక్‌ను ఇప్పించమని హార్పిక్ తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన మహేష్(24) తండ్రి గతంలో మరణించాడు. తల్లి అనిత కుటుంబాన్ని పోషిస్తున్నది. అయితే మహేష్‌కు తల్లి గతంలో బైక్ ఇప్పించింది. ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతూ ఈఎంఐలు కట్టలేదు. దీంతో ఫైనాన్సర్లు బైక్‌ను తీసుకెళ్లారు. బైక్ ఇప్పించమని తల్లిని అడిగి.. అనంతరం హార్పిక్ తాగాడు. గమనించిన స్థానికులు 108 ద్వారా తూప్రాన్ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.